నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 14 జనవరి 2025 | SURYAPET


సూర్యాపేట 45వ వార్డులో నిర్వహించిన భోగి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల

## భోగి మంటల్లో చెడు ఆహుతై.. మంచి ఉదయించాలి

- సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి సాధించాలి
- భోగి వేడుకల్లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : భోగి మంటల్లో చెడు ఆహుతై మంచి ఉదయించాలని.. దురాలోచనలు భోగి మంటల్లో బూడిదవ్వాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్ ఆధ్వర్యంలో విద్యానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భోగి వేడుకలతోపాటు పలు కూడళ్లలో చేపట్టిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ప్రజలంతా మూడు రోజుల సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలంటూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి సాధించాలన్నారు. మార్పు.. మార్పు అనుకుంటా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదంతా పేర్లు మార్చడంతోనే గడిచిపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలకులకు కనువిప్పు కలుగాలని, కేసీఆర్ వంటి అభివృద్ధి ఆలోచనలు ఈ ప్రభుత్వానికి రావాలని ఆకాంక్షించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పదేండ్లు బ్రహ్మాండంగా అభివృద్ధి పథంలో నడిచిందని తెలిపారు. సంవత్సర కాలంగా రేవంత్ పాలన మంచి ఫలితాలు సాధించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పాలకుల చెడు ఆలోచనలు భోగి మంటల్లో కాలిపోయి మంచి ఆలోచనలు చేయాలన్నారు. ప్రజల కష్టాలు తొలగించి ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కౌన్సిలర్ గండూరి పావని, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, జిల్లా నాయకులు గండూరి కృపాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


మన ఊరు- మన బడిలో భాగంగా అనంతగిరి ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిన దృశ్యం

## పాఠశాలలపై పాలిట్రిక్స్!

### 'మన ఊరు -మన బడి'ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- పనులు సగంలో ఉన్న బడుల్లో కాకుండా కొత్త స్కూళ్ల గుర్తింపు
- అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో నిర్మాణాలకు అడ్వాన్స్
- అసంపూర్తి నిర్మాణాలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ప్రభుత్వం రాజకీయం మాని పూర్తి చేయాలంటున్న తల్లిదండ్రులు
- పాత బిల్లు చెల్లింపు కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు

సూర్యాపేట, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా గత బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మన ఊరు – మన బడి పథకానికి శ్రీకారానికి చుట్టి అవసరమైన నిర్మాణాలు, వసతుల కల్పన చేపట్టింది. చాలాచోట్ల పనులు పూర్తికాగా, కొన్ని పాఠశాలల్లో మధ్యలో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో మిగిలి ఉన్న పనులను పూర్తి చేయకుండానే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఇతర పాఠశాలల్లో పనులను చేపడుతున్నది. సూర్యాపేట జిల్లాలో మన ఊరు–మన బడి ద్వారా 329 పాఠశాలల్లో చేసిన పనులకు గానూ మరో రూ.18 కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. అవి ఇవ్వకపోగా కొత్త కార్యక్రమం కింద జిల్లాలో రూ.21 కోట్లతో 536 పాఠశాలల్లో పనులు చేసేందుకు రూ.11 కోట్ల అడ్వాన్స్ విడుదల చేసింది. ఇతర స్కూళ్లలో పనులకు శ్రీకారం చుట్టడం వరకు బాగానే ఉన్నా, మన ఊరు – మన బడిలో భాగంగా చేపట్టిన బడుల్లో నిర్మాణాలన పూర్తిచేయడంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నది. పనులు పూర్తి చేసిన చోట కాంట్రాక్టర్లు ఏడాది కాలంగా బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు ఫలితం ఉండడం లేదు.

ప్రభుత్వ పాఠశాల్లో సమూల మార్పులను తీసుకువచ్చేందుకు గానూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం తీసుకువచ్చింది. దాంతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. అనేక స్కూళ్లు ప్రైవేటుకు ధీటుగా సకల వసతులను సమకూర్చుకున్నాయి. జిల్లాలో మొదటి విడుతలో ఎంపిక చేసిన 329 స్కూళ్లలో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్, గ్రీన్‌చాక్ బోర్డులు, పెయింటింగ్, ప్రహరీ, కిచెన్ షెడ్, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. పూర్తయిన పనులకు సంబంధించి రూ.18కోట్లు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాదైనా బిల్లులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నప్పటికీ, నిధుల విడుదలకు మోక్షం కలుగడం లేదు. స్కూల్ కమిటీలు, అధికారుల ఒత్తిడితో పనులు త్వరగా పూర్తి చేశామని, ఇప్పుడు బిల్లులు ఇవ్వకపోతే తమ పరిస్థితేంటని చిన్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల స్కూల్ కమిటీ సభ్యులే వర్క్ చేపట్టగా, అప్పులు చేసి పనులు చేశామని వాపోతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం తీసుకువచ్చింది. మన ఊరు–మన బడిలో భాగంగా ఎంపిక చేసిన 329 పాఠశాలల్లో 65 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా, మిగిలిన వాటిలో 50 నుంచి 80 శాతం మేర పూర్తయ్యాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాలు మధ్యలో ఉన్న పాఠశాలలను కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాలలో కొత్త స్కూళ్లను ఎంపిక చేసింది.

మన ఊరు–మన బడిలో ఇప్పటికే సగం మేర అయిన పనులు పూర్తి చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమైనా పట్టించుకోలేదు. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో మొదటి విడతలో 329 స్కూళ్లలో అవసరమైన మౌళిక సదుపాయలను కల్పించేందుకు గాను ఎంపిక జరిగింది. మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో 91 ఉన్నత పాఠశాలలు, 23 ప్రాథమికోత్న పాఠశాలలతో పాటు 215 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 65 పాఠశాలల్లో పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో 50 నుంచి 80 శాతం పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి 40 కోట్ల రూపాయల అంచనాలు ఉండగా గత ప్రభుత్వం రూ.22 కోట్లు చెల్లించింది. మరో రూ.18 కోట్లు పెండింగ్‌లో ఉండగా, ఆ బిల్లులను చెల్లించకుండానే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 కోట్ల అంచనాతో 536 పాఠశాలలను ఎంపిక చేసి రూ.11 కోట్లు అడ్వాన్స్‌గా చెల్లించింది. దాంతో తాము చేసిన బిల్లుల సంగతేంటని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన ఊరు–మన బడిలో మొదలు పెట్టి మధ్య ఉన్న పనులను అలాగే వదిలేయడంపై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల చదువులపై రేవంత్ సర్కారు రాజకీయం చేయొద్దని, అసంపూర్తి నిర్మాణాలపై శ్రద్ధ పెట్టి వెంటనే పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సంక్రాంతి సంబురం

## పల్లెల్లో పండుగ సందడి


నల్లగొండలో ముగ్గులు వేస్తున్న యువతులు


అర్వపల్లి : కొమ్మాలలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

### హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు తరలివచ్చిన జనం

### కుటుంబాలకు కుటుంబాలు రాక.. కొనసాగుతున్న ప్రయాణాలు

### పండుగను ఎంజాయ్ చేస్తున్న చిన్నాపెద్ద.. నేడు మకర సంక్రాంతి

యాదాద్రి భువనగిరి, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : ఆహ్లాదం పంచే ప్రకృతి ఒడిలో చిన్నాపెద్ద ఉత్సాహంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి. మూడ్రోజులపాటు ముచ్చటైన పండుగ సందర్భంగా పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి. ఉపాధి కోసం హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లిన జనం కుటుంబాలకు కుటుంబాలుగా సొంతూళ్లకు బాట పట్టడంతో గ్రామీణ ప్రాంతాలు సందడిగా మారాయి. పల్లెల్లో కార్లు పరుగులు పెట్టాయి. భోగి మంటలు, ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు, పతంగుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, బసన్నల విన్యాసాలతో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపిస్తున్నది. పండుగ ప్రయాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

#### గ్రామాల కళ కళ..

చాలారోజుల తర్వాత సొంతూళ్లకు వచ్చిన జనం ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటున్నారు. స్నేహితులతో కలిసి సరదాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. చిన్నా పెద్దా ఆటపాటలతో సంతోషంగా గడుపుతున్నారు. సెల్ఫీలు దిగుతూ సంతోషమైన జ్ఞాపకాలను పదిల పర్చుకుంటున్నారు. పండుగ నేపథ్యంలో అనేక గ్రామాల్లో క్రికెట్ టోర్నమెం ట్లు, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.

#### ఎన్నికల మచ్చిక

తర్వలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో రాజకీ య నాయకులు అందరినీ కలు స్తూ మచ్చిక చేసుకుంటున్నారు. ఓట్లప్పుడు అందరూ ఊరికి రా వాలని ఆశావహులు బతిమిలాడుతున్నారు. కొన్ని దావత్ లు ఇప్పటినుంచే షురూ చేశారు.

#### ఉత్సాహంగా భోగి

రామగిరి : మకర సంక్రాంతికి ముందు రోజు సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామునే మేలుకుని చుట్టుపక్కల జనమంతా ఒక్క చోటకు చేరి కాలనీలు, కూడళ్లు, ఇండ్ల ముందు భోగి మంటలు వేశారు. దాని చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా గడిపారు. చిన్నపిల్లలకు భోగి పండ్లు పోశారు. మరోవైపు మహిళలు, యువతులు ముంగిళ్లలో ఆకట్టుకునేలా ముగ్గులు వేయడంలో పోటీ పడ్డారు.


సూర్యాపేటలో బసవన్న



కట్టంగూర్‌లో హరిదాసు


నల్లగొండలోని వీటీ కాలనీలో పిండి వంటలు చేస్తున్న మహిళలు

## భగ్గుమంటున్న బియ్యం

### కొండెక్కిన సన్నాల ధర

- కొత్త బియ్యం క్వింటాకు రూ.5వేలు.. పాతవి రూ.6,200కిపైనే
- గత సీజన్‌తో పోల్చితే క్వింటాకు వెయ్యికిపైగా పెరిగిన ధర
- రేషన్‌లో ఇస్తామన్న సర్కారు.. ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



నల్లగొండ, జనవరి 13 : సన్న బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కొత్త బియ్యం క్వింటా రూ.5వేల నుంచి రూ.5,500 పలుకుతుండగా, పాతవి(గత వానాకాలం) కావాలంటే క్వింటాకు రూ.6,200 నుండి రూ.7వేల వరకు పెట్టాల్సి వస్తున్నది. గత సీజన్‌తో చూస్తే ప్రస్తుతం క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 ధర పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇదే సమయంలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెలలకు నెలలు దాటవేస్తూ.. హామీని అమలు చేయకపోవడంపై మండిపడుతున్నారు.

ప్రభుత్వాలు ప్రతి నెలా రేషన్ ద్వారా దొడ్డు బియ్యం ఇస్తున్నప్పటికీ కాలానుగుణంగా చాలా వరకు పేద, మధ్యతరగతి కుటుంబాలు కూడా సన్న బియ్యం అలవాటుగా మార్చుకున్నారు. అంతోఇంతో వ్యవసాయం ఉన్న కుటుంబాలు వారు తిండి గింజల వరకు సన్న వడ్లు పెట్టుకుని మిగతా దొడ్డు రకం పండించి మార్కెట్లో విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూమి లేని వారు మాత్రం సన్నం బియ్యం కొనాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఏటా వానకాలం సీజన్‌లో సన్న బియ్యం సాగు ఎక్కువగా అవుతుంది. అదే సమయంలో ఎక్కువ మంది బియ్యం కొనుగోలు చేస్తారు. ఈసారి ధరలు ఆకాశానికి అంటుతుండడంతో కొనడానికి ఇబ్బంది పడుతున్నారు. గత యాసంగిలో వరి సాగు 25 శాతం మాత్రమే కాగా. వానకాలంలో సాగైనా బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. గత వానకాలం సీజన్‌కు సంబంధించినవి సన్నం బియ్యం ఆరు నెలల కిందట క్వింటా రూ.4వేలు ఉండగా, ప్రస్తుతం రూ.6,500కి చేరింది. ప్రస్తుతం వానకాలం సీజన్ పూర్తి కాగా కొత్త బియ్యం మిల్లుల్లో, మార్కెట్లో లభ్యమైతున్నప్పటికీ ధరలు మాత్రం విపరీతంగా చెబుతున్నారు. కొత్తవి(ఈ వానకాలం సీజన్‌వి) క్వింటా రూ.5 వేల నుండి రూ.5,500 వరకు పలుకుతుండగా, పాతవి(గత వాన కాలానివి) రూ.6,200 నుంచి రూ.7వేల వరకు ఉన్నాయి. బీపీటీ రూ.5వేలకు పైగా. చిట్టిపొట్టి చింట్లు వంటి వెరైటీలు రూ.7వేల దాకా ధర నడుస్తున్నది. మరోవైపు క్వాలిటీ బియ్యాన్ని మిల్లర్లు స్థానికంగా విక్రయించకుండా హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తున్నది.

#### సర్కారు సన్న బియ్యం కోసం ఎదురు చూపులు..

తామ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఏడాది దాటినా అదిగో.. ఇదిగో అంటూ కాలం వెల్లదీస్తున్నదే తప్ప హామీ అమలుపై దృష్టి పెట్టింది లేదు. ప్రస్తుతం సన్న బియ్యం ధరలు భగ్గుమంటున్న నేపథ్యంలో ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు దారులకు సన్నం బియ్యం పంపిణీ చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. మరోవైపు ఈసారి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వానకాలం సీజన్‌లో సన్న ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ, ఆశించిన మేరకు ధాన్యం రాలేదు. నల్లగొండ జిల్లాలో ఈసారి 2.50లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనాలనే లక్ష్యంగా పెట్టుకున్నా.. సర్కారు పెట్టిన పెట్టిన తేమ శాతం కొర్రీతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు ఆసక్తి చూపలేదు. దాంతో 70వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే వచ్చింది.

#### సన్న బియ్యం కొనే పరిస్థితి లేదు



సన్న బియ్యం ధరలు కిందటేడుకు, ఇప్పటికి బాగా పెరిగాయి. గతంలో క్వింటా ఐదు వేలు ఉన్న బియ్యం ఇప్పుడు రూ.6,500కి అమ్ముతున్నరు. ఈ సీజన్‌లో పండిన బియ్యానికి క్వింటా రూ.5వేలకు పైగా చెప్తున్నారు. మేము ఇదే సీజన్‌లో ఏడాదికి ఒకసారి కొంటుంటాం. ఈసారి మిల్లుకు పోతే వాళ్లు చెప్పిన ధరలు విని తల తిరిగింది.

-దొడ్డ నాగేశ్వర్ రావు, అలకాపురికాలనీ, నల్లగొండ













